క్లుప్తంగా

అకాల వర్ష బాధిత రైతులను ఆదుకోండి

• కలెక్టర్‌కు ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ వినతి

కావలి: అకాల వర్షాలతో పంటలు దెబ్బతింటున్నాయని, వ్యవసాయాధికారులను పంపి పంట నష్టం జరిగిన పొలాలను పరిశీలించి నష్టాలను అంచనాలు వేయాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబుకు విజ్ఞప్తి చేశారు. శనివారం రాత్రి ఫోన్‌లో కలెక్టర్‌తో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో 50 వేల ఎకరాల్లో వరిపైరు కోత దశలో ఉందని, వర్షాలతో పైరు తడిసి దెబ్బతినిందన్నారు. పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో పంట నీళ్లలోనే నానుతుందని ఎమ్మెల్యే కలెక్టర్‌కు వివరించారు. ఆదివారం నీట మునిగిన పంటలను ఎమ్మెల్యే పరిశీలించనున్నారు.

ఉత్తమ ఫలితాలకు ప్రత్యేక దృష్టి



విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

సోమశిల: విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని జిల్లా సహాయ బీసీ సంక్షేమశాఖ అధికారి ఎం.శ్రీదేవి తెలిపారు. శనివారం అనంతసాగరం మండలం చిలకలమర్రి బీసీ బాలుర వసతిగృహంలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. వసతి గృహ పనితీరుపై తరచూ తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరమన్నారు. ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తుందని, ప్రతి పేద విద్యార్థి వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి అంకయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీ పూజ



పరీక్ష సామగ్రి అందజేస్తున్న దృశ్యం

దుత్తలూరు: స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులు సరస్వతీ పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సరస్వతీదేవి చిత్రపటాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు తమ పరీక్ష సామగ్రితో పాటు హాల్‌టికెట్లు అమ్మవారి వద్ద ఉంచి పూజించి వేడుకున్నారు. మేకపాటి పెద్దమాలకొండయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 73 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. ప్రిన్సిపల్ సైమన్ రావు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు.

వైభవంగా అలఘునాథుని కల్యాణం



ఆత్మకూరు: పట్టణంలోని అలఘునాథస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి కల్యాణం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి కల్యాణ ఘట్టాలను వివరిస్తూ అర్చకులు రామయ్యస్వామి, శ్రీనివాసశర్మ కల్యాణవేడుకలు నిర్వహించారు. ఆత్మకూరు వెలమ సంఘం ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ముగ్గురు వీఏఏలు సస్పెన్షన్

కావలి: వరిసాగు చేయకుండానే చేసినట్లుగా ఈ–క్రాప్‌లో నమోదు చేసిన ముగ్గురు విలేజ్ అగ్రికల్చర్ అసిసెంట్లను సస్పెండ్ చేస్తూ వ్యవసాయశాఖ అధికారులు శనివారం ఆదేశాలు అందించారు. దగదర్తి మండలం తడకలూరు ఆర్బీకే వీఏఏ ప్రశాంత్ ఊచగుంటపాళెంలో 66.47 ఎకరాల వరిసాగు చేసినట్లుగా ఈ–క్రాప్‌లో నమోదు చేశారు. అధికారుల తనిఖీల్లో ఆ భూముల్లో మామిడి, జామాయిల్, మిర్చి సాగులో ఉన్నట్లు గా నిర్ధారించారు. అల్లూరు మండలం ఇస్కపల్లి ఆర్బీకే వీఏఏ క్షేత్రజ్ఞ 55.63 ఎకరాలు వరి సాగు చేసినట్లుగా ఈ–క్రాప్‌లో నమోదు చేశారు. ఆ భూముల్లో అధికారులు పరిశీలించగా రొయ్యల చెరువులు ఉన్నాయి. మండలంలోని గ్రద్దగుంట ఆర్బీకే వీఏఏ భానుప్రకాష్ బట్రకాగొల్లులో 100 ఎకరాల్లో వరిసాగు చేసినట్లు ఈ–క్రాప్ చేయగా అధికారుల తనిఖీల్లో అందులో కాలనీ ఇళ్లు, ప్రభుత్వ భూములు ఉన్నాయి. సమగ్ర విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటారని కావలి ఏడీఏ కె.కన్నయ్య తెలిపారు.

రోడ్డు వివాదంపై సీఐ విచారణ

జలదంకి: మండంలోని బోయలపాడులో తమ ఇళ్లకు వెళ్లే రహదారిని మునగాల వెంకారెడ్డి కుటుంబ సభ్యులు మూసివేసి అడ్డుకుంటూ తమను ఇబ్బంది పెడుతున్నారని గుణపాటి సుశీలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సీఐ సాంబశివరావు శనివారం పరిశీలించారు. దాదాపు 30 ఏళ్లుగా 14 అడుగుల రోడ్డుగా ఉందని తెలిపారు. తహసీల్దార్ నివేదికలో కూడా ఈ రోడ్డుపై ఎవరికి ఎలాంటి హక్కులు లేవని స్పష్టంగా ఉందని, అడ్డుకోవడం తగదని వెంకారెడ్డి కుటుంబ సభ్యులకు చెప్పారు. ఆయనతో పాటు ఎస్సై వీరేంద్రబాబు ఉన్నారు.

అకాల వర్షంతో రైతుల ఆందోళన



జలదంకి: ధాన్యం తడవకుండా పట్టలు కప్పి ఉన్న దృశ్యం

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో శుక్ర, శనివారాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. అకాల వర్షాలతో కొండాపురం, జలదంకి, వింజమూరు, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లో వివిధ పంటలకు కొంత మేర నష్టం వాటిల్లింది. పంట మీద ఉన్న వరి పైరు కొన్ని చోట్ల నేలకొరిగింది. అరటి, బొప్పాయి తోటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మరో రెండ్రోజులు వర్షాలు ఉండే అవకాశం ఉన్నందున రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.

ధాన్యం నిల్వలకు ఇబ్బందులు

జలదంకి: మండలంలో శనివారం ఉదయం నుంచి జల్లులు జల్లులుగా వర్షం కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పట్టలు కప్పి ఉంచినా ధాన్యం కిందకు వర్షపు నీరు చేరుతుందని వాపోతున్నారు. వరికోతలు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో వర్షం కారణంగా పంట పొలాల్లో నీరు చేరుతుండడంతో కోతలు కోసేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంటున్నారు. అకాల వర్షం కారణంగా ఆరుగాలం పండించిన పంట నష్టపోతున్నామని, దళారులు వర్షం వల్ల ధరలు తగ్గించారని అధికారులు పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

వరి, పచ్చిశనగ, పత్తి, మిరపకు నష్టం

కలిగిరి: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు తాము కష్టపడి సాగు చేసిన పంటలు దెబ్బతింటున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తున్నాయి. కోత దశకు వచ్చిన వరి, పచ్చిశనగ, పత్తి, మిరప పంటలపై ఈ వర్షాలు తీవ్ర ప్రభావం చూపనున్నాయి. పలు గ్రామాల్లో శనివారం పిడుగులు పడడంతో ఇళ్లలోని టీవీలు, ఫ్యాన్లు, ఇతర గృహోపకరణాలు కాలిపోయాయి.

ఒక మోస్తారు వర్షం

కొండాపురం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం 3 గంటల వరకు మండలంలోని కొమ్మి, అగ్రహారం, పార్లపల్లి, సత్యవోలు, గూడవళ్లూరు, నేకునాంపేట, ఆదిమూర్తిపురం తదితర గ్రామాల్లో అకాల వర్షం ఒక మొస్తారుగా కురిసింది. దీంతో రోడ్లలపై వర్షం నీరు చేరాయి. అంతర్గత రోడ్లు చిత్తడి, చిత్తడిగా మరాయి. కోత దశలో ఉన్న వరి, పత్తి, మిరప, పొగకు పంటలకు ఈ వర్షం నష్టం కలిగిస్తుందని రైతులు వాపోతున్నారు.

రైతులకు నష్టం

అనుమసముద్రంపేట: మండలంలో శనివారం అకాల వర్షం బీభత్సం సృష్టించింది. దాదాపు అరగంట పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందారు. ఇప్పుడిప్పుడే పంట చేతికి వస్తున్న సమయంలో కొంత మంది రైతులు కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని రాసులుగా పోశారు. అయితే ఒక్కసారిగా వర్షం రావడం వల్ల రైతులు దిక్కుతోచని స్థితిలో భయాందోళనకు గురయ్యారు. కొంత మంది ధాన్యం రాసులపై పట్టలు కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు. వరి పంట నేలవాలింది. దీనికి తోడు కొన్ని చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి.

సంగంలో భారీ వర్షం

సంగం: సంగంతో పాటు పలు గ్రామీణ ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం స్వల్పంగా మేఘావృత వాతావరణం ఉండడంతో ఏ క్షణమైనా వర్షం కురవచ్చుననే సందేహంతో రైతులు ముందుగానే తమ ఉత్పత్తులను జాగ్రత్త చేసుకున్నారు. మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్కూళ్ల నుంచి ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో విద్యార్థులు వర్షంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

చేజర్లలో భారీ వర్షం

చేజర్ల: ఉన్నట్టుండి శనివారం సాయంత్రం ఒక్కసారి ఆకాశం మేఘావృతమై చేజర్లతో పాటు పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వర్షంతో పాటు ఈదురు గాలులు తోడవడంతో పలు చోట్ల చెట్లు నేలవాలాయి. పొలాల్లో, గుంతల్లో నీరు చేరింది. వర్షం కారణంగా దొరువుపాడు, వావిలేరు మార్గంతో చెట్లు రోడ్డుపై వాలాయి.

ఆత్మకూరులో భారీ వర్షం

ఆత్మకూరు: ఆత్మకూరులో శనివారం సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వరి కోతలు పూర్తి చేసి విక్రయించేందుకు సిద్ధంగా పొలాల్లో ఉన్న ధాన్యం రాసులపై పట్టలు కప్పుతూ జాగ్రత్త తీసుకుంటున్నారు. జేఆర్‌పేటలోని ఓ ఇంట్లోని కొబ్బరి చెట్టు గాలికి విరిగి విద్యుత్ తీగలపై వాలి రోడ్డుకు అడ్డుగా పడిపోయింది. దీంతో ఆ ప్రాంతంలో సుమారు రెండు గంటలకుపైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్‌శాఖ సిబ్బంది స్పందించి విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఆత్మకూరు–నాగులపాడు మార్గంలో ఈదురుగాలులకు కొన్ని చెట్లు అడ్డంగా పడ్డాయి.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం

ఆత్మకూరురూరల్: మండలంలోని గండ్లవేడులో శనివారం కురిసిన అకాల వర్షానికి 30 పుట్ల మేర వరి ధాన్యం తడిసి పోయిందని స్థానిక రైతులు వాపోయారు. యంత్రాల ద్వారా వరి కోతల అనంతరం పొలంలో ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దవ్వడంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుందని ఆవేదన చెందారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని స్థానిక రైతులు విజ్ఞప్తి చేశారు.



చేజర్ల: రోడ్డుపై పడిన చెట్లు



గండ్లవేడులో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు



సంగం: వర్షం కురుస్తున్న దృశ్యం



ఆత్మకూరు: జేఆర్‌పేటలో విరిగిపడిన కొబ్బరి చెట్టు

వణికిస్తున్న వాన



బిట్రగుంట: కడనూతలలో నేలకొరిగిన వరిపంట

• ఈదురుగాలులు, వర్షంతో రైతుల్లో ఆందోళన
• వరి, మామిడి, పత్తి, శనగ పంటలకు తీవ్ర నష్టం

బిట్రగుంట: బోగోలు మండలంలో శనివారం వేకువ నుంచి కురుస్తున్న వర్షం రైతులను వణికిస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో వేకువ నుంచే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. వర్షంతో పాటు భారీ ఈదురు గాలులు వీస్తుండడంతో పలు గ్రామాల్లో కోతకు సిద్ధమైన వరి పంట నేలవాలింది. గాలుల తాకిడికి మామిడి తోటల్లో పూత, పిందెలు రాలిపోయి తోటలు స్వల్పంగా దెబ్బ తిన్నాయి. మండలంలో ఇప్పుడిప్పుడే వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మండంలో 13,500 ఎకరాలకు పైగా వరి పంట సాగు చేయగా ప్రస్తుతం 30 శాతం మేర వరికోతలు పూర్తయ్యాయి. మిగిలిన చోట్ల వరి పంట అంతా వెన్ను తీసి కోతకు సిద్ధంగా ఉంది. అకాల వర్షం కారణంగా పంట నేలకు వాలడంతో రైతులు అల్లాడిపోతున్నారు. పాతబిట్రగుంట, కొండబిట్రగుంట, కడనూతల, జువ్వలదిన్నె, ఎస్వీపాళెం, ఉమామహేశ్వరపురం, తదితర గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పంట వర్షం కారణంగా దెబ్బతింది. తాళ్లూరు, బోగోలు, తదితర ప్రాంతాల్లో ధాన్యం రాసులు స్వల్పంగా తడిచిపోయాయి. రైతులు ఆరబోసిన ధాన్యం రాసులు దెబ్బ తినకుండా అధికారులు ముందస్తుగా శుక్రవారమే 15 వేల బస్తాలు సిద్ధం చేశారు. రాసులు పోసిన ధాన్యాన్ని బస్తాల్లోకి మార్చి జాగ్రత్త చేసుకోవాలని రైతులకు సూచించడం, రైతులు ఆ మేరకు జాగ్రత్తలు తీసుకోవడంతో పలు చోట్ల ధాన్యం రాసులకు ముప్పు తప్పింది. వర్షం, ఈదురుగాలుల కారణంగా మండలంలో విద్యుత్ సరఫరాకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు ఏడు గంటల పాటు సరఫరా నిలిచిపోయింది.

అంచనాలు రూపొందిస్తున్నాం

అకాల వర్షం కారణంగా పలు గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పంట స్వల్పంగా దెబ్బతింది. ఈ పంటలు పరిశీలించి అంచనాలు సిద్ధం చేస్తున్నాం. రైతులు పొలాల్లో నీళ్లు నిలబడకుండా పిల్ల కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. నేలవాలిన వరిని నిలబెట్టేలా ఏర్పాట్లు చేసుకోవడంతో పాటు 5 శాతం ఉప్పు నీటి ద్రావణాన్ని పిచికారీ చేసుకోవడం ద్వారా ధాన్యం మొలకెత్తకుండా, రంగు మారకుండా ఉంటుంది.

– విజయలక్ష్మి, ఏఓ, బోగోలు

రైతులకు తీవ్ర నష్టం

• నేలకొరిగిన వరి పంట



చేతికొచ్చిన వరి పంట నేలకొరిగిన దృశ్యం

కావలిరూరల్: ఆరుగాలం కష్టపడి పండించిన పంట అకాల వర్షంతో తడిసి ముద్దైంది. రైతుల కంట నీరు తెప్పించింది. శనివారం కురిసిన వర్షానికి పంట దశకు వచ్చిన వరి పంట నెలకొరిగింది. రైతులు కొన్నిచోట్ల వరికోత కోసి ధాన్యాన్ని ఆరబెట్టుకుంటుండగా అకాల వర్షంతో తడిసిపోయాయి. కావలి రూరల్ మండలంలో 30 శాతం వరి కోతలు కోయగా మరో 70 శాతం కోత దశలో ఉంది. ఈ వర్షంతో పొలాల్లో నీరు నిలిచి వరి కోత యంత్రాలు వేళ్లేందుకు వీలు లేక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

దూర ప్రాంతాలకు స్టార్‌లైనర్ సర్వీసులు

• ఆర్టీసీ ఆర్‌ఎం పీవీ శేషయ్య



డిపోలో తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్‌ఎం శేషయ్య

ఉదయగిరి: ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్, బెంగళూరు మార్గాల్లో త్వరలో స్టార్‌లైనర్ బస్ సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజారవాణా సంస్థ అధికారి పీవీ శేషయ్య తెలిపారు. ఆయన శనివారం ఆర్టీసీ డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన డిపోలోని అన్ని విభాగాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ డిపో అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా సర్వీసులు నడిపేలా ప్రణాళికలు రూపొందించాలని డిపో అధికారులకు సూచించామన్నారు. జిల్లాలోని ప్రతి డిపో నుంచి పౌర్ణమి తిథి సందర్భంగా భక్తుల గిరి ప్రదక్షిణ కోసం అరుణాచలంకు బస్ సర్వీసులు నడుపుతున్నామన్నారు. జిల్లాలో ఇప్పటికే నెల్లూరు, కందుకూరు డిపోల నుంచి నడుపుతున్న స్టార్‌లైన్ సర్వీసులకు ప్రయాణికుల స్పందన బాగుందన్నారు. డిపో నుంచి కర్నూలు, శ్రీశైలం సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీసీని ప్రతి ఒక్కరూ ఆదరించి, డిపో అభివృద్ధికి సహకరించాలన్నారు. ఆయన వెంట డిపో మేనేజర్ మార్లెళ్ల శ్రీనివాసరావు, సీఐ రామకృష్ణ తదితరులున్నారు.

శనగ రైతులకు మద్దతు ధర

• జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజరు పవన్




శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజరు పవన్

ఆత్మకూరురూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రంలో క్వింటాల్‌కు రూ.5,335 వంతున మద్దతు ధర అందిస్తామని జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజరు ఎస్.పవన్ తెలిపారు. ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ప్రాంగణంలో శనివారం శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ శనగల సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా తమ రైతు భరోసా కేంద్రంలో సంబంధిత పత్రాలు అందజేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. సీఎం యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. ఈ నెల 20వ తేదీ రిజిస్ట్రేషన్‌కు ఆఖరి గడువుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఒక్కొక్క రైతు నుంచి ఎకరాకు 8 క్వింటాల్ చొప్పున మూడు ఎకరాల వరకు 25 క్వింటాళ్ల మేర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. చిన్న, సన్నకారు రైతులకు శనగల కొనుగోలు కేంద్రంలో ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆత్మకూరు మండలంలో నెల్లూరుపాళెం, చెర్లోయడవల్లి, వెన్నవాడ, నారంపేట, బట్టేపాడు, బోయలచిరివెళ్లలో 1,081 ఎకరాల్లో శనగ సాగు చేసినట్లు తమ ప్రాథమిక నివేదికలు వచ్చాయన్నారు. ఆత్మకూరు కొనుగోలు కేంద్రానికి ప్రస్తుతానికి 243 టన్నుల కొనుగోలు లక్ష్యం నిర్ణయించామన్నారు. రైతులకు అవసరమైన గోనె సంచులు ప్రభుత్వమే సమకూరుస్తుందని శనగల్లో అన్య పదార్థాలు లేకుండా జల్లెడ పట్టి విక్రయ కేంద్రానికి తీసుకురావాలని ఆయన రైతులను కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కోనేపల్లి కృష్ణవేణి, ఏఎంసీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొండాపురం: ప్రభుత్వం శనగలకు క్విటా రూ.5,335 మద్దతు ధర కల్పిస్తుందని, రైతులు కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకోవాలని ఏపీ మార్కెఫెడ్ డీఎం ఎస్. పవన్‌కుమార్ తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య, వ్యవసాయాధికారి ప్రసూన శనివారం శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గింజలో తేమ 14 శాతం కన్నా తక్కువగా ఉండాలన్నారు. అయితే ఈ–క్రాప్ చేయించుకున్న రైతులు మాత్రమే కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవచ్చున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు పండించిన శనగ పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కందుకూరి ఈశ్వరచారి, రైతులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యార్థినులకు వైద్యపరీక్షలు



విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ గోపినాథ్

మర్రిపాడు: మర్రిపాడులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యాలయంలో జ్వరాలు సోకుతున్నాయనే సమాచారంతో ముందుస్తు జాగ్రత్త చర్యగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ విద్యాలయంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సీజన్‌లో బాలికలకు కొద్దిపాటి సమస్యలు ఉన్నా వెంటనే వైద్యాధికారిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సైదా, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల పరుగుకు స్వల్ప అంతరాయం

బిట్రగుంట: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో ఉరుములు, పిడుగులతో కూడిన అకాల వర్షం కారణంగా రైళ్ల పరుగుకు శనివారం స్వల్ప అంతరాయం ఏర్పడింది. వేకువ నుంచి కురుస్తున్న వర్షాలు, పిడుగుపాటు కారణంగా బిట్రగుంట స్టేషన్‌లో సిగ్నలింగ్ వ్యవస్థకు సంబంధించిన సమస్యలు తలెత్తాయి. దీంతో ఉదయం 10.45 నుంచి 12.15 గంటల వరకు రైళ్ల పరుగుకు స్వల్ప అంతరాయం ఏర్పడింది. పలు ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లను బిట్రగుంట, కావలి స్టేషన్లలో నిలిపేశారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు యుద్ధప్రాతిపదిన మరమ్మతులు చేపట్టారు. సుమారు గంటన్నర తర్వాత రైళ్ల పరుగు ప్రారంభమైంది.

విద్యార్థులకు రాగి జావ



ఆరవీడు పాఠశాలలో రాగి జావను తాగుతున్న విద్యార్థులు

ఆత్మకూరురూరల్: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఈ నెల 21 నుంచి అదనంగా రాగి జావను పౌష్టికాహారంగా అందించనున్న నేపథ్యంలో మండలంలోని ఆరవీడు, బోయల చిరివెళ్ల పాఠశాలల్లో శనివారం ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఒక్కో విద్యార్థికి పది గ్రాముల రాగి పిండి, పది గ్రాముల బెల్లం కలిపి తయారు చేసిన జావను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కొండారెడ్డి, తదితరులు విద్యార్థులతో తాగించారు. వారంలో మంగళ, గురు, శని ఉదయం 8.45 గంటలకు రాగి జావను పౌష్టికాహారంగా అన్ని పాఠశాలల్లో అందజేస్తారని తెలిపారు.

సకాలంలో పన్నులు చెల్లిస్తే వడ్డీ మాఫీ

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్ను, కుళాయి పన్ను చెల్లింపుదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు మార్చి 31వ తేదీ లోపు బకాయిలు చెల్లిస్తే వారికి వడ్డీ మాఫీ జరగనున్నట్లు కమిషనర్ ఎం.రమేష్ బాబు శనివారం తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే ఇళ్ల పన్నులు, కుళాయిలు పన్నులు పలువురు చెల్లిస్తున్నారని మున్సిపల్ సిబ్బంది సైతం పన్నుల వసూళ్లు ముమ్మరంగా చేస్తున్న ఆయన తెలిపారు. అయితే గతంలో పన్నులు చెల్లించకుంటే వారి వెసులు బాటు కోసం ప్రభుత్వం వడ్డీ మాఫీ ప్రకటించిందని ఈ అవకాశాన్ని చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదివారం సైతం మున్సిపల్ కార్యాలయంలో పన్నులు చెల్లించవచ్చునన్నారు.

పొదుపు మహిళలకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న ఏపీఎం

మర్రిపాడు: మండలంలోని పొదుపు గ్రూపు సభ్యులకు మెరుగైన సేవలు అందించనున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం బుజ్జమ్మ అన్నారు. మర్రిపాడులోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శనివారం పొదుపు మహిళలకు, వీఓఏలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా, చేయూతలో లబ్ధి పొందిన మహిళలకు గ్రామాల్లో యంత్ర పరికరాలతో జీవనోపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. పొదుపు గ్రూపుల్లో రుణాలు తీసుకుని సక్రమంగా చెల్లించిన వారికి ప్రభుత్వం 35 శాతం సబ్సిడీతో రుణాలు అందిస్తామన్నారు. ఈ రుణాలను పీఎంఈజీపీ పథకం ద్వారా పొందవచ్చునని, అవసరమైన యంత్రాలను కూడా కొనుగోలు చేసుకోవచ్చునన్నారు. గ్రామాల్లో మహిళలు ఇంటి దగ్గరే ఉంటూ స్వయం ఉపాధి పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు పొదుపు గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 31 మంది గైర్హాజరు

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర ఇంగ్లిష్ పరీక్షకు 31 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎం.కిరణ్ తెలిపారు. పరీక్షలకు మొత్తం 362 మంది విద్యార్థులకు 331 మంది హాజరయ్యారన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు

చేజర్ల: చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు మొత్తం 74 మంది ఉండగా 73 మంది హాజరయ్యారని చీఫ్ ఎగ్జామినర్ టి శ్రీధర్ శనివారం తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని డీవీఈఓ మధుబాబు తనిఖీ చేశారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఆత్మకూరు: ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని 4 కేంద్రాల్లో జరిగిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 231 మందికి ఆరుగురు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 200 మందికి 9 మంది, షిరిడీ సాయిరాం కళాశాలలో 255 మందికి 8 మంది, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 214 మందికి 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రిన్సిపల్ డాక్టర్ వాసుబాబు వివరించారు. స్క్వాడ్ బృందాలు పలు పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

ఆయుర్వేదంతో ఆరోగ్యం



రోగులకు వైద్యం అందిస్తున్న వైద్యురాలు

చేజర్ల: ఆయుర్వేద వైద్యం ప్రజలకు ఎంతో మేలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారిణి సుధారాణి అన్నారు. నిమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని నూతక్కివారి కండ్రికలో జరిగిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఆయుర్వేద మందులు ఎంతో అవసరమని, ఈ వైద్యంపై ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. ఈ మందులు చాలా నిధానంగా, ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ శరీరానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా పని చేస్తాయన్నారు. ఈ మందులు తీసుకునేవారు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని తెలిపారు. మోకాళ్ల నొప్పులు, గ్యాస్ట్రిక్ ట్రబుల్, చర్మంపై జిల వ్యాధిగ్రస్తులను ఆమె పరీక్షించారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. సుమారు 80 మంది రోగులను పరీక్షించారు. నిమి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు హరిబాబు, ఏపీఎంపీఏ జిల్లా కన్వీనర్ మన్నేపల్లి సురేష్ పాల్గొన్నారు.

మామిడి సస్యరక్షణకు చర్యలు



మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖాధికారి రాజశేఖరరెడ్డి

ఆత్మకూరురూరల్: మామిడి తోటలో పూతను పరిరక్షించుకుని నాణ్యమైన కాయల దిగుబడి కోసం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆత్మకూరు ఉద్యానవనశాఖ అధికారి రాజశేఖరరెడ్డి అన్నారు. మండలంలోని అప్పారావుపాళెంలో మామిడి తోటలను క్షేత్ర పరిశీలన చేసి రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. తేనే మంచు పురుగు ఉధృతి నివారణ క్లోరోపైరిఫాస్ 2.5 మి.మీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. సాఫ్ 2 గ్రాములు, ఇతర సందేహాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీఈఓ కోనేపల్లి కృష్ణవేణి, వ్యవసాయ సహాయకురాలు అర్చన, స్థానిక రైతులు పాల్గొన్నారు.

బియ్యం లారీ బోల్తా

ఆత్మకూరు: నెల్లూరులోని రైస్‌మిల్లు నుంచి తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాకు బియ్యం తరలిస్తున్న లారీ బోల్తాపడింది. శుక్రవారం అర్ధరాత్రి బియ్యం లోడ్‌తో బయలుదేరిన లారీ నెల్లూరు–ముంబయి రహదారిపై వెంకట్రావుపల్లి సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్ అల్తాఫ్ స్వల్పగాయాలతో క్షేమంగా బయటపడ్డాడు. ఈ ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివశంకర్ రావు తెలిపారు.